క్లుప్తంగా

అందుబాటులో యూరియా



మునగపాక పీఏసీఎస్‌కు లారీతో చేరుకున్న యూరియా

మునగపాక: రైతులకు అవసరమయ్యే ఎరువులు అందుబాటులోకి తీసుకొస్తున్నామని మునగపాక పీఏసీఎస్ సీఈవో ఆడారి వేణుగోపాలరావు తెలిపారు. మునగపాక పీఏసీఎస్‌కు శనివారం యూరియా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కొక్క యూరియా బస్తా రూ.266గా విక్రయిస్తున్నామన్నారు. పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు పీఏసీఎస్‌లో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ప్రారంభం



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్ తదితరులు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పోలిమేర కృష్ణ తగు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు శనివారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ స్టేజ్‌పై మూడు నెలలుగా పూజలందుకున్న ఉత్సవ మూర్తులకు భారీ ఊరేగింపుతో అనుపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి

పేకాటరాయుళ్ల అరెస్టు



పోలీసులకు పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

పాయకరావుపేట: మండలంలోని చినదొడ్డిగొల్లులో శనివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ. 6 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తురువోలులో జంతు సంక్షేమ పక్షోత్సవాలు

చీడికాడ : మండలంలో తురువోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు మాట్లాడుతూ మానవజాతి, మనుగడలో కీలకపాత్ర వహిస్తున్న జంతువుల పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. ఎండాకాలంలో పశుపక్ష్యాదులు నీళ్లు లేక తిండి లేక ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పెదగోగాడ పశువైద్యాధికారి రాఘవమ్మ, హెచ్ఎం రామకృష్ణ, జి.పి.నాయుడు, పశువైద్య సహాయకులు రాజేష్ పాల్గొన్నారు.

89 మందికి ఉచిత వైద్య సేవలు

కె.కోటపాడు : సూదివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను శనివారం నిర్వహించారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ 89 మందికి వైద్య పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందించారు. బి.పి, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలను వైద్యాధికారి సాయికిరణ్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊళ్లు వెలిశాయి..

సదుపాయాలు నిలిచాయి

- జగనన్న కాలనీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- 23 లేఅవుట్లు.. 720 మంది లబ్ధిదారులు
- పక్కా రోడ్లు, డ్రైనేజీ లేక అవస్థలు



నిరుపయోగంగా కుళాయి



మునగపాకలోని జగనన్న కాలనీ

మునగపాక: అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు ఉండాలని నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తపించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేసి వాళ్ల సొంతిళ్లు నిర్మించుకునేందుకు పట్టాలు అందించడంతో పాటు ఆర్థిక సహకారం కూడా చేశారు. దీంతో ఊళ్లు వెలిసాయి. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో సదుపాయాల లేమితో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

పేదోడి సొంతింటి కల జగన్‌తోనే సాధ్యం..

పేదోడి సొంతింటి కల మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమైంది. అర్హులైన వారిని గ్రామసభల్లో ఎంపిక చేసి వారందరికీ పట్టాలు మంజూరు చేశారు. ఇందు కోసం ప్రభుత్వ స్థలాలు లేని చోట రైతుల నుంచి భూములు సేకరించి ఇంటి స్థలాలు అందజేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలం కోసం ఎదురు చూశామని.. జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని తమ కల నెరవేరిందంటూ హర్షం వ్యక్తం చేశారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న 90 రోజులకే అర్హులైన వారందరికీ పట్టాలు ఇస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంత వరకు పట్టాలిచ్చిన దాఖలాలు కనిపించలేదు.

23 లేఅవుట్లు.. 720 మంది లబ్ధిదారులు..

మండల వ్యాప్తంగా 23 లే అవుట్లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం 720 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి పట్టాలు అందజేశారు. వాటిలో 410కి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 17 గృహాలు శ్లాబ్ స్థాయిలో ఉన్నాయి. 26 గృహాలు గోడల స్థాయిలో, 8 గృహాలు సన్‌షెడ్ స్థాయిలో, 186 గృహాలు పునాది స్థాయిలో ఉండగా మరికొన్ని ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 50 వేలు, అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 వేలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12 వేలు వెరసి రూ.లక్షా 92 వేల మేర ఆర్థిక సహాయం అందించారు. దీంతో లబ్ధిదారులు తమ స్తోమతను బట్టి సొంతింటి కలను నెరవేర్చుకున్నారు.

కానరాని మౌలిక సదుపాయాలు..

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మంజూరైన కాలనీలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాల్సి ఉంది. అయితే కాలనీల్లో అటువంటి సౌకర్యాలు కానరాలేదు. పక్కారోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. అలాగే డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇవన్నీ చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న కాలనీలు అభివృద్ధి చెందిపోతాయేమోనన్న దుర్బుద్ధితోనే ఇలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



పక్కా రోడ్డుకు నోచుకోని మునగపాక జగనన్న కాలనీ

సదుపాయాలు కల్పించలేదు..



వర్షా కాలంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. కాలనీ ఏర్పాటు జరిగినా ఇంత వరకు ఎటువంటి సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. అధికారులు స్పందించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– పోలమూరి బాబూరావు, జగనన్న కాలనీ, తిమ్మరాజుపేట

పక్కా రోడ్డు లేదు..



జగనన్న కాలనీలో పక్కా రోడ్డు, డ్రైనేజీ సదుపాయం లేదు. కుళాయిలు సక్రమంగా పని చేయడం లేదు. కాలనీకి అవసరమయ్యే సదుపాయాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించిన నాడే కాలనీలు అభివృద్ధి చెందుతాయి.

– మళ్ల ప్రసాద్, జగనన్న కాలనీ, మునగపాక

చర్యలు తీసుకుంటాం..

మండలంలోని ఒక గ్రామానికి చెందిన లే అవుట్‌ను గుర్తించి అక్కడ పైలెట్ ప్రాజెక్ట్‌గా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించిన ఆదేశాలు వచ్చాయి. పైలెట్ ప్రాజెక్ట్ లేఅవుట్ అభివృద్ధి జరిగితే ఇతర లేఅవుట్లు కూడా అభివృద్ధి చెందుతాయి.

– రాము, హౌసింగ్ ఏఈ

ప్రత్యేక ప్యాకేజీ కోరుతూ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పాయకరావుపేట: తమకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. తుని-పాయకరావుపేటకు చెందిన శ్రీ సాయి శ్యామల మేషనరీ యూనియన్ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. తుని నుండి పాయకరావుపేట బైపాస్ సెంటర్ వరకు 3 కిలోమీటర్ల మేర నిర్వహించిన ర్యాలీలో కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు. సంఘం అధ్యక్షుడు మజూరి నారాయణరావు, కమిటీ సభ్యులు, తుని- పాయకరావుపేట పట్టణాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక (అచ్యుతాపురం): మునగపాక మండల కేంద్రంలోని శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయ శాశ్వత నిధికి పెంటకోట ఆదినారాయణ కుమారులు విజయ్, అజయ్ రూ. లక్షా నూట పదహారు శనివారం విరాళంగా అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో ఈ నగదు అందజేశారు. ధూప, దీప, నైవేద్యాల నిమిత్తం ఈ నగదు అందజేసినట్లు దాతలు తెలిపారు. అదే విధంగా శ్రీరామ నవమి వేడుకల నిమిత్తం రూ. యాభై వేల నూట పదహారు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, పాలిమేర కృష్ణ, పెంటకోట శ్రీను, ఆడారి సూరి చంద్రరావు, విరాళ దాత కుటుంబీకులు స్వాతి, రేవంత్, రికిల్, దేవి తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



అపరాల సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి, కృష్ణాపురం, యలమంచిలి పరిసర ప్రాంతాల్లో పలు పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ఎస్ రామలక్ష్మి, ఎంబీజీఎస్ కుమారి, యలమంచిలి ఏవో మోహన్‌రావు నేతత్వంలోని బృందం ఈ గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న, రాగి, అపరాల పంటలను పరిశీలించారు. మొక్కజొన్న తోటల్లో కత్తెర పురుగు ఉన్నట్టు గుర్తించారు. ఈ పురుగు నివారణకు ఎటువంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో రైతులకు తెలిపారు. అపరాలపై బూడిద తెగులు సోకినట్టు చెప్పారు. దీని నివారణకు నీటిలో కరిగే గంధకాన్ని మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఎరువుల ప్రాముఖ్యత, పంటల దిగుబడి పెరిగేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి అరుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల అరెస్టు సరికాదు



మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి (యలమంచిలి): అధిస్తాన్ బ్రాండిక్స్ పరిశ్రమలో కార్మికుల వేతనాల పెంపుపై మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులను అరెస్టు చేయడం సరికాదని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు అన్నారు. రాంబిల్లి మండలం కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో అధిస్తాన్ పరిశ్రమలో యూనిట్ 1,3 కార్మికులు శనివారం కంపెనీ లోపల వేతనాలు పెంచాలని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్న సందర్భంగా వారికి మద్దతుగా నిలిచిన సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కూండ్రపు సోమునాయుడు, చింతకాయల శివాజీ, చలపతిల అరెస్టును ఖండించారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికుల వేతనాలు పెంచాలని, అరెస్టు చేసిన సీఐటీయూ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన



ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

మునగపాక (అచ్యుతాపురం): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి ప్రభాకరరావు, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు శనివారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో వసతులు, విద్యార్థుల సంఖ్య, రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులతో మమేకం అయ్యారు. జీవో 117 రద్దు వల్ల పాఠశాలలకు కలిగే సానుకూల, ప్రతికూల అంశాలపై చర్చించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు శంకరరావు, మట్టా శ్రీనివాస్, సోమయాజులతో పలు అంశాలపై చర్చించారు. ఉమ్మలాడ యూపీ పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాల, నాగులాపల్లి ఉన్నత పాఠశాల, నాగులాపల్లి ఎలిమెంటరీ పాఠశాల, మునగపాక ఉన్నత పాఠశాల, మునగపాక మెయిన్ యూపీ పాఠశాల, మూలపేట ఎలిమెంటరీ పాఠశాల, తోటాడ ఉన్నత పాఠశాల, తోటాట ఎలిమెంటరీ పాఠశాల, సిరసపల్లి ఎలిమెంటరీ పాఠశాలలను సందర్శించారు.

వచ్చే ఖరీఫ్ నాటికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు



ఎల్‌బీపురం ఎత్తిపోతల పథకం పనులు పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం

బుచ్చెయ్యపేట : మండలంలో ఎల్.బి.పురం ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సాగునీరు అందిస్తామని, ఇరిగేషన్ ఈఈ పి. త్రినాథం అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకానికి రూ.4 కోట్లు వ్యయంతో పనులు చేపట్టామని అన్నారు. ఎల్.బి.పురం, బంగారుమెట్ట, గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి 350 ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందుతుందన్నారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, రైతులు సూచనలు, అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని కాలువలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

4న మసమ్మ అమ్మవారి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో గల శ్రీ మసమ్మ తల్లి తీర్థం ఈ నెల 4వ తేదీ రథ సప్తమి రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతి నిధులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, గుర్రాల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ రూ.8 వేలు, తృతీయ రూ.5 వేలు, నాలుగో బహుమతి రూ.3 వేలు, ఐదో బహుమతి రూ. 2 వేలు అందజేస్తామన్నారు. గుర్రాల పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, ఐదు బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు అందజేస్తామన్నారు.

వైభవంగా తులసీ తీర్థం



తులసీ తీర్థంలో మహిళల కోలాటం ప్రదర్శన

యలమంచిలి రూరల్: పట్టణానికి సమీపంలో తులసీరావు ఘాట్ వద్ద శనివారం తులసీ తీర్థం వైభవంగా జరిగింది. దివంగత ఆడారి తులసీరావు స్మారకంగా ప్రతి ఏటా ఆయన జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబీకులు ఇక్కడ తీర్థం నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తులసీరావు కాంస్య విగ్రహానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, తులసీరావు కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడి రైతులకు తులసీరావు చేసిన సేవలను ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్లు గుర్తు చేశారు. అనంతరం తీర్థాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి భారీగా మహిళల కోలాట బృందాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అలరించాయి. రాత్రి 10 గంటల వరకూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గొంతిన నాగేశ్వర్రావు, ఆడారి చిన్నా, ఆడారి వెంకట్, మళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచు వర్షంతో ఇక్కట్లు



కోటవురట్లలో కురుస్తున్న మంచు

కోటవురట్ల: మంచు ఏకంగా వర్షంలా కురిసింది. దట్టంగా కమ్ముకున్న పొగమంచు చిరుజల్లులా పడింది.దాంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్లాసులకు మంచు పట్టేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వైపర్లు ఆన్‌చేసి రాకపోకలు సాగించారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటలైనా మంచు వీడకపోవడంతో అందరూ అవస్థలు పడ్డారు. ఏజెన్సీ ప్రాంతాన్ని మించి మంచు వానలా కురవడం చర్చనీయాంశమైంది.

తలకొరివి పెట్టి కన్న రుణం తీర్చుకున్న కుమార్తె



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నిహారిక

ఎస్.రాయవరం: ఓ యువతి తండ్రికి తలకొరివి పెట్టి కన్న రుణం తీర్చుకుంది. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన మళ్ల జగన్నాథం నక్కపల్లి సంతలో శుక్రవారం కూరగాయలు అమ్ముతూ గుండెపోటుకు గురై నక్కపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు మగ పిల్లలు లేరు. ఒకే కుమార్తె. దాంతో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమార్తె నిహారిక శ్మశానంలో తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని తలకొరివి పెట్టి కన్న రుణం తీర్చుకుంది.

మెరుగైన బోధనతోనే సత్ఫలితాలు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు



పిల్లల పఠనా సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు ఎలా శిక్షణ పొందున్నారు.. ప్రత్యేక తరగతుల్లో ఏం నేర్చుకున్నారని ప్రశ్నించారు. వెనుబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే దిశగా తీసుకున్న చర్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు బి.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు మీనప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

కొత్తపేట హైస్కూల్‌లో..

యలమంచిలి రూరల్: జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు శనివారం స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఎలా అమలు చేస్తున్నారో ఆరా తీశారు. శతశాతం ఫలితాలు సాధించాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయండి

పోలీసు అధికారులతో 9వ అదనపు జిల్లా జడ్జి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి

చోడవరం రూరల్ : లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్న కుమార్ కోరారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో చోడవరం కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో వచ్చే నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయడానికి సన్నాహక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి రత్న కుమార్ మాట్లాడుతూ మార్చిలో జాతీయ స్థాయి లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సంగతి వెల్లడిస్తూ, ఇరు వర్గాల సమ్మతితో పరిష్కరించ గలిగే కేసులను గుర్తించి వారి మధ్య సయోధ్యకు కృషి చేయాలని చెప్పారు. లోక్ అదాలత్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరింపబడితే కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. ప్రధాన సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడుతూ ఇరు వర్గాలకు ప్రయోజనం కలగడంతో పాటు కోర్టుల చుట్టూ తిరిగి కాలయాపన చేయాల్సిన అగత్యం ఉండదన్న సత్యాన్ని వారికి తెలపాలన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ మాట్లాడుతూ కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కారం ద్వారా పోలీసులు, కోర్టులకు సమయం, రికార్డుల మెయింటెనెన్స్ వంటి ఇబ్బందులు తప్పుతాయన్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.రమణమ్మ, చోడవరం సీఐ అప్పలరాజు, ఇతర పోలీసు అధికారులు తమ సలహా, సూచనలను అందజేశారు.



హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది